క్లుప్తంగా

రాష్ట్ర ప్లానింగ్ వైస్ చైర్మన్‌కు శుభాకాంక్షలు



గద్వాల రూరల్: రాష్ట్రప్లానింగ్ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జిల్లెల చిన్నారెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అల్వాలపాడులో బ్రహ్మోత్సవాలు ప్రారంభం





ఆంజనేయ స్వామి ముస్తాబు చేస్తున్న రథం

ధరూరు: మండలంలోని అల్వాలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ఉదయం స్వామివారి అలంకరణ, కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు గ్రామ అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు. కర్ణాటక భక్తులు పాల్గొని ప్రత్యేకంగా నైవేద్యాలు స్వామికి సమర్పించారు. రాత్రి అఖండ భజన నిర్వహించారు. గురువారం స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్‌జీటీయూ మండల కార్యవర్గం ఎన్నిక



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎస్‌జీటీయూ ఇటిక్యాల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య హాజరై ఎస్‌జీటీ, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల సమస్యలు, విద్యా పటిష్టం కోసం చేయాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా రత్నయ్య, అధ్యక్షుడిగా శ్రీరాముడు, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా రాముడు, తదితరులను కార్యవర్గంలో తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీటీయూ నాయకులు సోమసుందర్‌రెడ్డి, కాంతయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశువులకు ఉచిత టీకాలు

అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ వ్యాధిని అరికట్టేందుకు పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన వ్యాక్సిన్ కార్యక్రమం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి ఆధ్వర్యంలో కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని కేశవరంలో పశువులకు సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడారు. ఈవ్యాధి పశువులకు ప్రాణాంతకంగా మారుతుందని, పశువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. థైలెరియా వ్యాక్సిన్ థైలెరియోసిస్ అను టిక్‌బోర్న్ వ్యాధులను నివారిస్తుందన్నారు. పశువులకు వ్యాక్సిన్ వేయించాలనుకునేవారు పశువైద్యశాలలో సిబ్బందిని సంప్రదించి, వివరాలు తెలియజేయాలని సూచించారు.

శాంతినగర్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వడ్డేపల్లి మండలంలోని గాంధీనగర్‌లో మంగళవారం సంకర, విదేశీ ఆవులకు థైలేరియా వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామంలోని 56 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పుష్పలత తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, ఎల్ఎస్‌ఏ లతీష్, వీఏ ప్రభాకర్, ఓఎస్ రవికిరణ్‌లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అయిజ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అమరవాయికి చెందిన కలుకుంట్ల రవి ట్రాక్టర్‌తో మంగళవారం తుంగభద్ర నది నుంచి అయిజకు అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా చిన్నతాండ్రపాడు వద్ద పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు.

డ్రైయినేజీ శుభ్రం చేయండి

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ స్టేజీలో డ్రెయినేజీ కాల్వలు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రోడ్డు సమీపంలోని కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగి చెత్తాచెదారం, ప్లాస్టిక్ గ్లాసులు అడ్డుపడి మురుగు నిల్వడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. దోమలు ఉధృతి పెరిగి రోగాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు.

నాలుగేళ్లుగా ఎదురుచూపులే!

- బాలింతలను పట్టించుకోని సర్కార్
- ఖాతాలో జమకాని కేసీఆర్ కిట్ నిధులు
- ప్రభుత్వం మారిన కనిపించని పురోగతి



జిల్లా ప్రభుత్వాసుపత్రిలో బాలింతల వార్డు

గద్వాల క్రైం: మాతా శిశుమరణాలను తగ్గించడంతో పాటు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం, ప్రైవేట్ ఆస్పత్రుల వైపు ప్రజలు వెళ్లకుండా గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకం ప్రారంభించింది. ఆడ బిడ్డకు జన్మనిస్తే రూ.13 వేలు, మగ బిడ్డకు జన్మనిస్తే రూ.12 వేల ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంది. జిల్లాలో ఈ పథకం నీరుగారుతోంది. నాలుగేళ్లుగా 72,133 మంది బాలింతలకు రూ. 21,43,320 లక్షలు అందాల్సిన నిధులు అందకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనా ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఈ పథకం కింద నాలుగు విడతల్లో బాలింతల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారు. గర్భిణిగా నమోదు, ఏఎన్‌సీ చెకప్, సర్కారు దవాఖానలో ప్రసవం, పిల్లలకు మూడు నెలల టీకా వేయించినప్పుడు ఇలా నాలుగు విడతల్లో అందిస్తారు. ప్రసవం అయిన రోజునే శిశువుకు, బాలింతకు కావాల్సిన సామగ్రి కేసీఆర్ కిట్ బ్యాగ్ కూడా అందించే వారు. ఈ పథకాన్ని ప్రారంభించిన రెండేళ్ల వరకు సక్రమంగానే గర్భిణుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. నాలుగు సంవత్సరాలుగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది.

జిల్లాలో 72 వేల మంది..

జిల్లాలో 2020 ఏప్రిల్ నుంచి కేసీఆర్(ఎంసీహెచ్) డబ్బులు అందడం లేదు. ప్రతి సంవత్సరం 15 మందికిపైగా గర్భిణులుగా నమోదవుతున్నారు. ఏఎన్ఎంలు వీరి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. బాలింతలు తమ ఖాతాల్లో నిధులు ఎప్పుడు జమ అవుతాయంటూ తరచూ సిబ్బందిని అడుగుతున్నారు. మరోవైపు అప్పటి ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యానికి, ప్రస్తుత ప్రభుత్వం బాలింతలకు చెల్లించాల్సిన నిధులను అందిస్తే కాస్త ఊరట లభిస్తుంది. గర్భిణులు ప్రసవం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే రూ.30 వేలు బిల్లు రూపంలో వసూలు చేస్తారు. ప్రభుత్వాసుపత్రిలో రూపాయ ఖర్చు లేకుండా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందుతుంది. ఈ పథకం కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు అవుతుందా? లేక మరుగున పడుతుందా? అనే అంశంపై త్వరలో తేలనుంది.

త్వరలో అందేలా చర్యలు తీసుకుంటాం



పెండింగ్‌లో ఉన్న కేసీఆర్ కిట్ డబ్బులు బాలింతల ఖాతాలో త్వరలో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటాం. గతంలోనే ఉన్నతాధికారులకు నివేదికలను అందజేశాం. ప్రతి ఒక్కరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయి. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయి.

– శశికళ, జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి

పల్స్ పోలియోపై అవగాహన



క్యాతూర్‌లో మాట్లాడుతున్న ప్రసూనరాణి



మానవపాడులో మాట్లాడుతున్న రిజ్వానతాన్విర్

అలంపూర్ రూరల్: మార్చి 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి మాట్లాడుతూ 0–5 ఏళ్ల పిల్లలందరికీ పోలియో రాకుండా పోలియో చుక్కలు వేయించాలన్నారు. క్యాతూర్ ఆరోగ్య కేంద్రంలోని గ్రామాలను 3 రూట్లుగా విభజించి ప్రతిరూట్‌కు ఒక సూపర్‌వైజర్‌ను ఏర్పాటు చేసి వ్యాక్సిన్ 6గంటల వరకు అందించాలన్నారు. బస్టాండ్, జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల సముదాయంలో రెండు పోలియో కేంద్రాలను ఏర్పా టు చేసి ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. మండలంలో 3,285 మంది 0–5 ఏళ్ల పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. 3న పోలియో చుక్కలు వేసుకోని వారికి 4,5 తేదీలలో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేసి, వందశాతం పూర్తి అ య్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి లక్ష్మీకాంతం, డాక్టర్ ప్రతిభస్ఫూర్తి, రామస్వామి, రేష్మా, రూట్ సూపర్‌వైజర్ బాలీశ్వరయ్య శెట్టి, అక్కమ్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవపాడు: పల్స్ పోలియో కార్యక్రమంపై మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ రిజ్వాన తాన్విర్ అవగాహన కల్పించారు. పోలియో చుక్కలపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 4,779 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందిస్తామన్నారు. 3 రూట్లలో 138 వైద్య సిబ్బంది ద్వారా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సత్యానారాయణ, హెలెన్, చంద్రన్న, సంధ్యారాణి, తిరామల్‌రావు సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ విష్ణు వైద్య సిబ్బందికి సూచించారు. ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మండలంలో 0–5 సంవత్సరాలలోపు చిన్నారులు మొత్తం 5052 మంది ఉన్నారన్నారు. వారికోసం మండల వ్యాప్తంగా 44పల్స్ పోలియో బూత్‌లతో పాటు 4రూట్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు నాగమ్మ, వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు.

నేటినుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు



అయిజ: పట్టణ సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈనెల 28, 29 తేదీల్లో నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయంలో సుప్రభాతసేవ, స్వస్తీపారాయణం, మూలవిరాట్లకు అభిషేకం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, కళశస్థాపన, సర్వతోభద్ర మండలి పూజ, హోమ ప్రజ్వలన, ధ్వజారోహణం, మహానైవేద్యం, తీర్థప్రసాద వితరణ, అంకురార్పణ మూల విరాట్ల హోమం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురువారం సుప్రభాత సేవ, స్వస్తిపారాయణం, ఉత్సవమూర్తుల అభిషేకం, గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం, పూర్ణాహుతి, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక మేళా



గద్వాల: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక విశిష్ట నోబుల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక మేళా ఆకట్టుకుంది. విద్యార్థులు తమలోని సృజనాత్మకతతో అందరిని ఆలోచింపజేసే తీరులో ప్రదర్శన పరికరాలను రూపొందించారు. వందమంది విద్యార్థులు మేళాలో తమ సృజనాత్మకతను చాటారు. వైజ్ఞానిక ప్రదర్శనను విద్యార్థుల తలిదండ్రులు తిలకించారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, పాఠశాల వ్యవస్థాపకుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సహకార వ్యవస్థకు చేయూతనందిస్తాం



సూపర్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న ప్రసాద్ రావు

అయిజ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తమవంతు సహకారం అందిస్తామని జిల్లా సహకార శాఖ అధికారి (డీఎస్‌ఓ) ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయాన్ని, సూపర్ మార్కెట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా డీఎస్‌ఓ మాట్లాడారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పీఏసీఎస్‌లకు గోదాంలు నిర్మించి రైతులకు ప్రత్యక్షంగా ఉపయోగపడేందుకు తీవ్రంగా కృషిచేస్తుందని అన్నారు. దీని కోసం రూ.1.25 కోట్లు ఖర్చుచేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇప్పటికే అయిజ సొసైటీకి ప్రభుత్వం 2 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కేటాయించిందని, అందులో గోదాంలు నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సొసైటీకి సంబంధించి మండలంలోని పులికల్‌లో పెట్రోల్ బంక్ ఏర్పాటు, మండల కేంద్రంలో గోదాంల నిర్మాణం చేపట్టాలన్నారు. సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా సొసైటీ ద్వారా 300 రకాల సేవలు అందిస్తామన్నారు. సర్టిఫికెట్లు జారీ, వృద్ధులకు నేరుగా పింఛన్ డబ్బు చెల్లించే విధానం, విమానం, రైలు టికెట్లు బుక్ చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) కూడా అయిజ సొసైటీకి మంజూరైనట్లు తెలిపారు. త్వరలో దాన్ని ప్రారంభించి ప్రజలకు మేలు చేసే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు రిజిస్ట్రార్లు మహేష్, విజయభాస్కర్ రెడ్డి, ఏఓ నారాయణ, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సూపర్ మార్కెట్ ఇన్‌చార్జి భీమార్జున్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది జీవన్, శ్రీనివాస్, భక్త ప్రహ్లాద, రాజు పాల్గొన్నారు.

తప్పెట్లమొర్సులో అగ్ని ప్రమాదం



గట్టు: మండలంలోని తప్పెట్లమొర్సులో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చలరేగి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. తృటిలో ప్రమాదం నుంచి మహిళలు బయట పడ్డారు. బాధితుల వివరాల ప్రకారం.. తప్పెట్లమొర్సుకు చెందిన తలారి బజారన్న ఇంట్లో బజారి శివ దీక్షను చేపట్టారు. బుధవారం ఇరుముడి ధరించి శ్రీశైలానికి పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. ముందస్తుగా మహిళలు పిండి వంటలు తయారు చేస్తున్న క్రమంలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చలరేగాయి. వెంటనే మహిళలు బయటకు పరుగులు తీశారు. మంటలు మరింత ఉధృతం కావడంతో ఇంట్లోని దుస్తులు, వంట సామగ్రి, బియ్యం, రూ.30 వేలు కాలిపోయాయి. దీన్ని గమనించిన చుట్టు పక్కల వారు గ్యాస్ సిలిండర్ ఆఫ్ చేసేందుకు ఇసుక పోయడం, తడి గోనె సంచులు సిలిండర్‌పై వేసేందుకు విశ్వప్రయత్నం చేశారు. గద్వాల నుంచి ఫైరింజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో తలారి పార్వతమ్మ, గుంజపల్లి భాగ్యమ్మలు గాయ పడగా వారిని అయిజలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మూడు లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు పేర్కొన్నారు.

ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించి, ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట మధుసూదన్‌బాబు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ముక్కెరన్న, తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



తప్పెట్లమొర్సులో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



కొంకలలో..

గట్టు: మండలంలోని తప్పెట్లమొర్సు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేశారు. కలెక్టర్‌గా ఊర్మిళ, డీఈఓగా శ్రీదేవి, ఎంఈఓగా వివేకానంద, హెడ్మాస్టర్‌గా వివేకానంద, ఉపాధ్యాయులుగా కొంత మంది విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ శరణప్ప, ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తిరుమలేష్, రామకృష్ణ, శేఖర్ బాబు, అశోక్, రాములు, ఎంవీఎఫ్ వలంటీర్ తిరుపతమ్మ పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకల మండల పరిషత్ ఉన్నతపాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటనర్సమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రవికుమార్, తిరుమలమ్మ, శ్రీజ, విద్యార్థులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతు



కేటీదొడ్డి: కొన్ని రోజులుగా తాగునీరు కోసం కొండాపురం గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై పంచాయతీ అధికారులకు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం పంచాయతీ కార్యదర్శి మునినాయక్ బోరుకు మరమ్మతు చేయించి మోటారు వేసి తాగునీరు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తు లు సంతోష వ్యక్తం చేశారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



మల్దకల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 28 నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 132 మంది విద్యార్థులు, ఇంటర్ రెండో సంవత్సరం 67మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుఅవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ అభ్యర్థులు 303, ఒకేషనల్ అభ్యర్థులు 69 మంది, మొత్తం 372 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంటల్ అధికారి కృష్ణవర్ధన్‌లు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి, గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు.

మానవపాడు: మండలంలోని గంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ జూనియర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని ప్రిన్స్‌పాల్, పీఎస్ పద్మావతి, డీఓ రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథ మ సంవత్సరం విద్యార్థులు 180 మంది హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు.

భక్తజన సంద్రం.. జములమ్మ క్షేత్రం



అమ్మవారి దర్శనం కోసం తరలివస్తున్న భక్తులు



జములమ్మ అమ్మవారు

గద్వాల న్యూటౌన్: జములమ్మ అమ్మవారి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మొదటి మంగళవారం అమ్మవారి ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్ల వారు జామున 5గంటల నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నడిగడ్డ ప్రాంతంతో పాటు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేలాదిగా తరలివచ్చారు. కోళ్లు, మేకపోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సల్లంగా చూడమ్మ జములమ్మ తల్లి అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



అశ్వ వాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు



చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

గద్వాల: పండితులు వేద మంత్రోచ్చరణాల మధ్య భూలక్ష్మీ చెన్నకేశవస్వామి సుదర్శన చక్రానికి చక్రస్నానం సాంప్రదాయబద్ధంగా చేయించారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గద్వాల కోటలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం చేశారు. భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి పూజ నిర్వహించారు.

వైభవంగా ఊరేగింపు..

భూలక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా అశ్వవాహనంపై నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయం నుంచి పురవీధుల గుండా పెద్ద అగ్రహారంలోని అహోబిళమఠం వరకు ఊరేగింపు చేశారు. మఠంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేసి తిరిగి ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. భజనలు చేస్తూ, భక్తీ గీతాలు ఆలపిస్తూ భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాత్రి నాగవళి, దేవత విసర్జన, సర్వసమర్పణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంతో బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.

శ్రీశైలానికి తరలిన శివస్వాములు



ఇరుముడులతో తరలి వెళ్తున్న శివస్వాములు



శ్రీశైల క్షేత్రానికి బయలుదేరిన సాలెవీధి వాసులు

ధరూరు: నలభై రోజులుగా నియమ నిష్టలతో శివ మాల ధరించి మంగళవారం శ్రీశైలానికి బయలుదేరారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని మన్నాపురం, అల్వలపాడు, కోతులగిద్ద, మార్లబీడు, పారుచర్ల గ్రామాల నుంచి శివ స్వాములు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ప్రత్యేక పూజల అనంతరం కుటుంబ సభ్యులు శివ స్వాములను పంపించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సారి కూడా ధరూరు గ్రామానికి చెందిన రాజేశ్వరి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసీడ్స్ డీలర్ సీతారాములు సొంత ఖర్చులతో పాద యాత్రగా వెళ్తున్న శివ స్వాములకు వాటర్ బాటి ళ్లు, అరటి పళ్లు, బ్యాగ్స్ అందజేశారు. కార్యక్రమా ల్లో గురు స్వాములు మల్లి, కే రవి, దర్శెల్లి, కారం రవి, గోపిరెడ్డి, సీతా రాములు ఆధ్వర్యం లో శివ స్వాములు, 60 మంది యువ కులు తరలి వెళ్లారు.

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణం లోని సాలెవీధి కాలనీ వాసులు మంగళవారం శ్రీశైలానికి పాద యాత్ర చేపట్టారు. శ్రీశైలం మల్లికార్జు న స్వామి దర్శనార్థం అలంపూర్ నుంచి సాలెవీధి వాసులు సోమేశ్వరి, మీనాక్షి, లాస్య, జ్యోతి, చంద్రకళ, మ హాలక్ష్మి, దిలిప్, రామ్, చింటు, మనోజ్‌లు వెంకటపురం నుంచి కాలనడక శ్రీశైల క్షేత్రానికి బయలుదేరారు. కాలినడకన శ్రీశైలానికి వెళ్లడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. స్వామి వారి దర్శనానికి నడుచుకుంటూ మొదటిసారి వెళ్లడం ఎంతో అదృష్టంగా బావిస్తున్నట్లు తెలిపారు.